క్లుప్తంగా

సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేయాలి

తెలకపల్లి: సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గోపస్ లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే సీసీఐ ఏర్పాటు చేసి రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయాలని కోరారు.

ఘనంగా గంధోత్సవం



చారకొండ: మండలంలోని జూపల్లిలో గ్యార్మీ వేడుకలు సందర్భంగా మహబూబ్‌సుభానీ దర్గా గంధోత్సవం మంగళవారం నిర్వహించారు. గ్రామంలో ప్రధాన రహదారి నుంచి ట్రాక్టర్, ఒంటెపై ప్రధాన వీధుల గుండా గంధాన్ని ఊరేగిస్తూ దర్గా వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గంధోత్సవంలో వెల్దండ సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటయ్య యాదవ్, నాయకులు బాలే మియా, బాల్‌రాజు, ముస్తాఫా, జగపతిలు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం



పెద్దకొత్తపల్లి: డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిని సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు మెరుగురాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పెద్దకొత్తపల్లి సింగిల్‌విండోను డీసీసీబీ బ్యాంక్ పరిధిలోకి మార్చాలని చైర్మన్‌కు విన్నవించారు. కొల్లాపూర్ ఎస్‌బీఐ బ్యాంక్ పరిధిలో ఉండడంతో రుణాలు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనికి చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు మెరుగురాజు పేర్కొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకుందాం



కల్వకుర్తిరూరల్: సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందామని వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ మనోహర్ అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో సద్దుల బతుకమ్మ సందర్భంగా బతుకమ్మ పోటీలు నిర్వహించారు. సుభాష్‌నగర్ కాలనీకి చెందిన విజయలక్ష్మి, జగదీశ్వర్ దంపతులకు మొదటి బహుమతిని ఆయన అందజేశారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

తహసీల్దార్‌కు వినతి



వెల్దండ: మండలంలోని చెర్కూర్ రెవెన్యూ శివారులో ఉన్న భూమి ధరణిలో కన్పించడం లేదని మాచుపల్లి మాధవి మంగళవారం తహసీల్దార్ కార్తీక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. 2018 సంవత్సరంలో తన తండ్రి ఆలేటి నారాయణసాగర్ సర్వే నంబర్ 82లో 18 గుంటలు, 76లో 3 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి తన పేరమీద భూమి ఉందని వివరించారు. కొన్ని నెలల నుంచి ఆన్‌లైన్ భూమి వివరాలు కన్పించడం లేదని వాపోయారు. పూర్తి విచారణ చేసి తనకు న్యాయం చేయాలని బాధితురాలు విన్నవించింది.

గుండెపోటుతో యువకుడి మృతి

మన్ననూర్: అంబేడ్కర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త దుమర్ల లక్ష్మయ్య (45) గుండెపోటుతో మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆరేళ్ల కిందట ఉపాధి కోసం కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లి జీవిస్తున్నారు. విజయదశమి పండుగ సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లాడు. పండుగ ముగించుకొని మంగళవారం హైదరాబాద్‌కు బయలుదేరుతుండగా ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురై కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.




నాగర్‌కర్నూల్‌లో అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు.. ఉప్పునుంతలలో..

అబ్దుల్‌కలాంకు ఘన నివాళి

నాగర్‌కర్నూల్‌రూరల్: భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను మంగళవారం స్థానిక విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ 1931 అక్టోబర్ 15న తమిళనాడులోని రామేశ్వరంలో పేద కుటుంబంలో జన్మించి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని కొనియాడారు. క్షిపణులు తయారుచేయడంతో కీలక పాత్ర వహించారన్నారు. సుధాకర్‌రెడ్డి, యుగేందర్, వెంకట్‌రెడ్డి, వీరేశలింగం తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద అబ్దుల్‌కలాం విగ్రహానికి ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మేడిపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వెంకటేష్, చందన పూలమాల వేసి ఆయన సేవలను విద్యార్థులకు వివరించారు.

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలను నిర్వహించారు. అబ్దుల్‌కలాం దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బషీర్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): మండలంలోని కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో పలు సంఘాల ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.



బిజినేపల్లి మండలం కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



తాడూరులో కలాం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి



లింగాల ఉన్నత పాఠశాలలో..



అచ్చంపేటలో..

విద్యావ్యవస్థపై నిర్లక్ష్యం తగదు



అచ్చంపేటలో ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న ప్రైవేటు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యం వహిస్తోందని బీఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం విశ్వవికాస్ డిగ్రీ కళాశాలలో ఆయన విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుని మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు చదువులకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. సెమిస్టర్ పరీక్షల నిర్వహణ ఆలస్యం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. సకాలంలో పరీక్షలు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.రామకృష్ణ

అచ్చంపేట రూరల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి అధికారంలో ఉన్న ప్రభుత్వాలు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, ప్రైవేటు కళాశాల యాజమాన్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ భారంగా మారిందన్నారు. మూతపడే స్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా ప్రైవేటు కళాశాలల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): మండలంలోని కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం పాలెం కాంప్లెక్ హెచ్‌ఎం సయ్యద్ మొయినుద్దీన్ సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. మాక్ టెస్టులకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఉపాధ్యాయులు ఇంద్రాణి, చైతన్య, భాగ్యలక్ష్మి, విద్యార్థులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



చారకొండ: మండలంలోని గోకారం గ్రామానికి చెందిన పంజుగుల లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 20 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకయ్య గౌడ్, అంజనేయులు, కొండల్, సాయికుమార్, రషీద్, శ్రీను, మహేష్, హరి తదితరులు ఉన్నారు.

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన దేశమోని శాంతమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. మాజీ సర్పంచ్ అన్వర్‌పాషా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

బీటీ రోడ్డుకు కొలతలు



చారకొండ: బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఇటీవల మండలంలోని చంద్రాయన్‌పల్లి, గోకారం గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో మంగళవారం మండల కేంద్రం నుంచి పరిధిలోని చంద్రాయన్‌పల్లి, బైరాపూర్ వరకు 13 కిలోమీటర్లు చంద్రాయన్‌పల్లి నుంచి గోకారం గేట్ వరకు 7 కి. మీ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి అవసరం అయిన కొలతలు, కల్వర్టులు, లోలెవల్ వంతెనలు తదితర వాటిపై వివరాలతో మండల పంచాయతీ రాజ్ ఏఈ దివ్య నమోదు చేసుకున్నారు. పూర్తి వివరాలతో సంబంధిత అధికారులకు అందజేస్తామని ఏఈ పేర్కొన్నారు.

సభను జయప్రదం చేద్దాం

వీపనగండ్ల: మాలల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలని జిల్లా మాల ఉద్యోగుల సంఘం నాయకులు జెట్టి వెంకటస్వామి అన్నారు. ఈ నెల 27వ తేదీన నాగర్‌కర్నూల్ పట్టణంలో నిర్వహించనున్న మాలల ఆత్మగౌరవ సభకు చెందిన కరపత్రాలను మంగళవారం మండల కేంద్రంలో ఆయన విడుదల చేశారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు

కొల్లాపూర్: పట్టణంలోని రాజవీధి హనుమాన్ ఆలయంలో నవగ్రహ విగ్రహాలతో పాటు పలు దేవతామూర్తుల విగ్రహాలను మంగళవారం ప్రతిష్ఠించారు. నవగ్రహ, గణపతి, శివలింగం, నాగ దేవతల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. దేవతామూర్తుల విగ్రహాలను పట్టణంలో మంగళవాయిద్యాల మధ్య రథంపై ఊరేగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యానాగరాజు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, పంజాబీనాథ్, ఉదయ్‌కుమార్, వనజారెడ్డి, సరిత తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటపొలాల పరిశీలన

మన్ననూర్: వానాకాలంలో సాగుచేస్తున్న వరి పంట పొలాలను మంగళవారం క్షేత్రస్థాయిలో ఏఈఓలు సీతారాం, రమేష్‌లు పరిశీలించారు. మన్ననూర్, మాచారంలో వరి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులు సాగుచేసిన వరి పంటను ఆకు ముడత తెగులు ఆశించిదని తెలిపారు. పంట దిగుబడి తగ్గేందుకు అవకాశం ఉందని దీని నివారణకు ఫ్లూబెండామైడ్ 50 గ్రాములు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ రెండింటిలో ఏదో ఒక రకం మందును ఒక ఎకరానికి 60 ఎంఎల్ చొప్పున పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.



వరిపైరును పరిశీలిస్తున్న ఏఈఓ సీతారాం

దళితులపై దాడులు అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తాడూరు: దళితులపై దాడులు అరికట్టాలని అంబేడ్కర్ జాతర కమిటీ అధ్యక్షుడు ఐతోల్ లక్ష్మయ్య, కొట్ర బాలు, దళిత సంఘాల నాయకులు మల్లేష్, భగవంత్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఐతోల్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని పాపగల్‌లో దసరా సందర్భంగా జమ్మి చెట్టు వద్ద డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తున్న దళితులపై దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ఉప్పునుంతల: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ తారాసింగ్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీలో ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించడంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వైద్యాధికారిణి స్వప్న, ఎంపీహెచ్‌ఓ మధునాయక్, డీపీఎంఓ మధు, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రభావతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తారాసింగ్

సమస్యల పరిష్కారానికి దృష్టి సారించండి

లింగాల: గ్రామాలలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ ఆంజనేయులు సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ అభివృద్ధి పనుల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి పథకం సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా విధులకు గైర్హజరు అయితే చర్యలు తప్పవని అన్నారు. గ్రామాలలో వర్షాలకు ఇళ్ల మధ్య ఉన్న చెట్లను, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించడంలో ఉపాధి సిబ్బంది తగు కార్యాచరణ తయారు చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. సమావేశంలో ఎంపీఓ చంద్రశేఖర్, ఏపీఓ ఇమాంఅలీ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ

పేదలందరికీ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వర్తింపజేయాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆర్థికంగా వెకనబడిన అన్ని కులాలకు 10 శాతం రిజర్వేషన్లు అందించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ హెచ్చరించారు. మంగళవారం సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా అగ్ర కులాల వారు 7 శాతానికి పైగా లేరని అందులో 2 శాతానికి మించి పేదలు లేరని విద్యా, ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్‌లు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. పోటీ పరీక్షల్లో ఎక్కువ మార్కులు వచ్చిన బీసీ అభ్యర్థుల కంటే తక్కువ మార్కులు వచ్చిన అగ్రకులాలకు ఉద్యోగాలు లభించాయని వాపోయారు. దామాషా ప్రకారం అన్ని సామాజిక వర్గాల ప్రజలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్ యాదవ్, నాయకులు నిరంజన్ యాదవ్, శ్రీనివాసులు, తిరుపతయ్య, లక్ష్మయ్య, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు

కల్వకుర్తిరూరల్: ధాన్యం కొనుగోలులో రైతులు దళారులను ఆశ్రయించి మోసపావద్దని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. గ్రేడ్ ఏ రకం క్వింటాల్‌కు రూ.2320లు, సాధారణ రకానికి రూ.2300లు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కార్యాలయంలో లాకర్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో శ్యాం, రాముసాయక్, పుల్లారెడ్డి, శ్రీనివాస్‌రావు, రాజవర్ధన్‌రెడ్డి, వర్కాల భాస్కర్‌రెడ్డి, ఈఓ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జనార్దన్‌రెడ్డి

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పెద్దకొత్తపల్లిలో టీకాలు వేస్తున్న వీఏ శైలజ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో మంగళవారం పశువైద్య సిబ్బంది గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ శైలజ మాట్లాడుతూ పశువులు, గేదెలకు, గొర్రెలకు, మేకలు గాలికుంటు వ్యాధి భారిన పడకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేయించాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ఓఎక్స్ కర్ణాకర్‌రెడ్డి, గోపాలమిత్ర, యాదగిరిలు పాల్గొన్నారు.




చారకొండలో..

చారకొండ: మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను మంగళవారం మండల పశువైద్యాధికారి శివకుమార్ ప్రారంభించి టీకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ ఆరు నెలలు పైబడిన పశువులకు టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ షేక్ మదర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతాం

పెంట్లవెల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సీపీఎం మండల ప్రథమ మహాసభను హనుమంతు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పర్వతాలు హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, ఈశ్వర్, ఎల్లగౌడ్, తిమ్మస్వామి, శివవర్మ, సలీం కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



ఎంఈఓ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఉప్పునుంతల: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీఆర్‌టీయూ నాయకులు మంగళవారం ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రశేఖర్‌కు విన్నవించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో పీఆర్‌టీయూ నాయకులు ఇన్‌చార్జ్ ఎంఈఓను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. విద్యాభివృద్ధికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ం శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు బిచ్చనాయక్, శ్యాంసుందర్‌గౌడ్, మల్లికార్జున్, అజ్మతుల్లా, రాములునాయక్, మండల నాయకులు ఎన్ నరసింహారెడ్డి, ఎండీ అమీర్‌పాషా, రాంచంద్రారెడ్డి, గోపి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.